



'జర్నలిస్టుగా నాకు ఫ్రేంక్'గా మాట్లాడే అలవాటు. ముసుగులో గుద్దులాటలు మొహమాటాలు నాకు నచ్చవు. సామాజిక స్పృహ, అవగాహన లేకుండా రచనల్ని చేసేవాళ్ళను నేను 'ద్రోహు'లంటాను. అలాంటి రచనల్ని విమర్శించాల్సి వచ్చినప్పుడు చీల్చి చెండాడటం నా ధర్మం. మీ లాంటి 'పాపులర్' రచయిత్రులు అలాంటి రచనలు చేయటం యీ జాతి దురదృష్టం. జీవితాన్ని, సామాజిక సమస్యల్ని అధ్యయనం చేయటం నేర్చుకోండి.' చైతన్య కాలిపోయిన సిగరెట్‌ను ఏష్ ట్రేలో పడేసి కొత్త సిగరెట్ వెలిగించటం కోసం ఆగేడు.

చైతన్య పేరు ప్రఖ్యాతులున్న జర్నలిస్టు. వామపక్ష పత్రిక వొకదానిలో పనిచేస్తుంటాడు. అతని భావాలు ఎంత పదునో మాటలంత వాడి. రచనలంతకన్నా వేడి. ఆ తీవ్రవశ్యమే అతనిలోని ఆకర్షణాశక్తి.

చైతన్య చిన్ననాటి ఆప్తమిత్రుడు పద్మపాణి. వామదక్షిణ పక్షాల పిచ్చులు అతనికి లేవు. ఎంతసేపు వాదిప్రతివాదుల గోడవే! ఆ వూళ్లో క్షణం తీరికలేని లాయర్. కోర్టులో తర్కబద్ధంగా వాదనలుచేసి చేపట్టిన కేసునల్లా గెలిపించటంలో మేటి. ప్రతిపక్ష లాయర్‌నే తన వాదనతో బోల్తా కొట్టించగలడు. బయట అతనో గొప్ప శ్రోత. నోట్లో నాలుకే లేనట్లు ఎవరేం చెప్పినా వోపిగ్గా వినగలడు.

అతని భార్య అమృత పేరు ప్రఖ్యాతులున్న వో గొప్ప రచయిత్రి. ప్రాచీన సంస్కృతీ సంప్రదాయాల్లోని ఆరోగ్య లక్షణాలను ఆధునిక తత్వంతో మేళవించినట్లుంటాయి ఆమె వేషభూషణ భాషణాదులు. మూర్తీభవించిన తెలుగు ఆడబడుచు ఆమె. ఆమె రచనలూ అంతే. ఎంగిలి వాసనలు, విదేశీ భావనల మాడు కంపు కొట్టవు. జాతీయమైన చైతన్యానికి ప్రతిబింబాలు ఆమె రచనలు.

చైతన్య ఘాటైన వుపన్యాసం విని అమృత తియ్యగా గంభీరంగా నవ్వింది. అతను సిగరెట్ కాల్చుకుంటూండగా భర్తతో కళ్ళతోనే మాట్లాడింది.

"మీరు వెలిబుచ్చిన అభిప్రాయాలతో అక్షరాలా ఏకీభవిస్తాను నేను. అయితే మాటల అర్థాలు మన దృక్పథాన్నిబట్టి మారుతుంటాయనుకొంటాం. నా రచనల్లో సామాజిక స్పృహలేదని మీ అభియోగం. అది శుద్ధ తప్పు. మీ సంకుచిత దృష్టి ఫలితం ఆ భ్రమ!!

చైతన్యకు యితరుల్ని 'ఎటేక్' చేయటమే తెల్సు. 'ఎటేక్' చేస్తే భరించే శక్తి లేదు. అంచేత యిర్రిటేట్

అయ్యాడు. "సంకుచిత దృష్టా ?" అన్నాడు.

"అవును.నాది రచయిత దృష్టి. మీది రాజకీయవాది దృష్టి. నాది జాతీయ దృష్టి. మీది విజాతీయ దృష్టి-"

యింత దాడిని ఆ ఆడకూతురి నుంచి వూహించలేదు చైతన్య. నివ్వెర పోయాడు ! నోట మాట రాలేదు !

"మీది వర్గ చైతన్యం. నాది విశ్వ చైతన్యం. మీది కల. నాది వాస్తవం. మీకు భవిష్యత్తు పట్ల భ్రమలు తప్ప భూత వర్తమానకాలాలపై విశ్వాసంలేదు. నాకు మూడు కాలాల సంమయనంపై విశ్వాసం వుంది. మీది నిరాశా దృష్టి. నాది ఆశా దృష్టి. జాతిని నిర్వీర్యంచేసే ధోరణి మీది. తేజోవంతం చేసే ప్రయత్నం నాది. అందుకే నా రచనల్ని ప్రజలు అభిమానిస్తున్నారు. మీ రాజకీయ వ్యూహానికి నా భావాలు, ధోరణి సరిపడదు గనుక, మీకు నేనన్నా నా రచనలన్నా భయం. అందుకే మీ సమీక్ష వక్రదృష్టితో నడిచింది."

జడివాన కురిసి వెలసినట్లయింది. భావాలు యింత ఘాటుగావున్నా వాటిని అమృత వ్యక్తంచేసిన రీతిలో సరళత్వమే వుంది.

చైతన్య పేలవంగా నవ్వేడు. పద్మపాణి వైపు చూస్తూ అన్నాడు.

"నీ శ్రీమతి చాలా ఎగోయిస్ట్‌లా కన్పిస్తోంది. ఆమె నవలపై నా సమీక్ష నేను వూహించినదానికన్నా ఎక్కువగా ఆమెను 'అఫెండ్' చేసినట్లుంది. అయామ్ సారీ. కాని రచయితలు తమ గ్రంథాలపై సమీక్షలను 'స్పోర్టివ్'గా తీసుకోవటం నేర్చుకోవాలి. ఏమంటావ్ పాణీ ?"

పాణి మామూలుగానే చిరునవ్వు నవ్వేడు. భార్య వైపు చూశాడు.

"సిద్ధాంతాన్ని సిద్ధాంతంతోనే ఖండించండి సార్. దాన్ని పక్కదోవకు తిప్పితే పలాయనవాద మవుతుంది. మీ అభియోగాలకు అభియోగాలతోనే సమాధానం యిచ్చాను. మీ సమీక్ష నన్ను అఫెండ్ చేయలేదు. ఎందుకంటే నాకు పాఠకుల బలం వుంది. కానీ మిమ్మల్ని నా మాటలు అఫెండ్‌చేసేయని స్పష్టంగా కన్పిస్తోంది. రచయితలూ ఫ్రేంక్‌గానే మాట్లాడతారు. రాస్తారండీ. జర్నలిస్టులు 'ఫ్రేంక్' అంటూనే తమ పత్రికల సిద్ధాంతాలకు అమ్ముడుపోయి వొక్కోసారి చిన్న వార్తలను పెద్ద వార్తలను చేస్తారు. పెద్ద వార్తలను 'కిల్' చేస్తారు. కాదంటారా ? అది ఎలాంటి సామాజిక స్పృహో కలవిస్తారా ?"

"అంటే మీరు నా సామాజిక స్పృహనే అనుమానిస్తున్నారా ?"

"ఖచ్చితంగా. మీకు సామాజిక స్పృహ లేదు. రాజకీయ స్పృహ, ఆర్థిక స్పృహ, అధికార స్పృహ మాత్రమే వున్నాయి. అందుకే మీకు సమాజాన్ని, అందులో వ్యక్తుల్ని వివిధ కోణాలనుంచి పరిశీలించి సమగ్రమైన రచనలు చేసే వారంతా 'రిఎక్షనరీస్'గా కన్పిస్తారు. సంకుచిత వర్గ దృక్పథంతో రచనలు చేసేవారిని, మీ వ్యూహానికి పనికివస్తారు కనుక ఆకాశాని కెత్తేస్తారు."

ఆ పైన చర్చ చాలా తీవ్రంగా నడిచింది. చైతన్య ఆమె అభిప్రాయాలను ఖండించాడు. ఆమెది బూర్జువా తత్వమన్నాడు. అతను వాడే పడికట్టు మాటలన్నీ ఎంగిలి పదాలని ఎగతాళి చేసింది అమృత. అతని భావనలు రెండేళ్ళ క్రితం కొత్తవి కావచ్చు. అయితే యివాళ్ళ ఆ సిద్ధాంతాలు పాతబడ్డవని పొడిచింది. ప్రపంచంలో చనిపోయిన సిద్ధాంతాలు పదే పదే వల్లె వేసేవారు 'భావదరిద్రులు' అనితిట్టింది.

"మన చర్చ ఆధారంగా నేను వ్యాసం వ్రాస్తాను" అన్నాడు చైతన్య ఛాలెంజింగ్‌గా.

"వ్రాయండి. నేను కూడా మీ జర్నలిస్టు పద్ధతుల్ని గురించి వో కథ వ్రాస్తాను" అని డిక్లేర్ చేసింది అమృత.

చర్చ అంత దూరం వెళ్ళాక పద్మపాణి శ్రోతనుంచి జడ్జిగా మారేడు.

"డిస్కషన్ అడ్‌జరన్డ్. రైటయినా లెఫ్టయినా, 'అన్నం పరబ్రహ్మ స్వరూప' మన్న భావన వద్ద ఎవరికీ పేచీలుండ వనుకొంటా. ఆ కార్యక్రమాన్ని ముగించి వాదులాడుకోటం సిసలైన 'రైట్‌పాత్'. ఏమంటారు ?"

* * *

ముగ్గురూ నవ్వుకొన్నారు. భోజన కార్యక్రమానికి లేచారు.

'కుక్క మనిషిని కరవటం సహజం. మనిషి కుక్కను కరవటం వార్త' అని విశ్వసించే ఛాందసపు జర్నలిస్టే అయినా మాధవరావుకు అభ్యుదయ ముద్రవుంది. అందుక్కారణం ఆయన పనిచేసిన పత్రిక. వామపక్ష సిద్ధాంతాల్ని ప్రచారం చేసే ఆ పత్రిక పనికట్టుకొని మాధవరావుకు అమిత ప్రచారం యిచ్చింది. మనిషి కుక్కను కరవటంలో కూడా అభ్యుదయ ధోరణిని చిత్రించే ధోరణికి ఎదిగేడు మాధవరావు.

అనిత మాధవరావు కూతురు. అయినా ఆయన ధోరణి వొక్కటీ వంటపట్టలేదు కాగా ఆయన ధోరణిని విమర్శించేది. పవిత్రమైన పత్రికారచన, సిద్ధాంతాల ముసుగులో, ఆర్థిక లాభాల వ్యామోహంలో పడి, ప్రజలను అపమార్గంలో మళ్ళిస్తున్నదే అని బాధపడేది.

చదువుతోపాటు ఆమె భావనలు, ఆలోచనలు వికసించాయి. విశాలత్వాన్ని సంతరించుకొన్నాయి. జాతీయతాస్ఫూర్తి మాతృదేశం పట్ల ప్రేమ ఆమెలో పొంగి ప్రవహించాయి. జర్నలిజం కోర్సు చదివింది.

తండ్రి అనారోగ్యంవల్ల వుద్యోగ

విరమణచేసిన ఆయనస్థానాన్ని పత్రికలో పొందింది.

జీవితమంతా 'సంస్కరణ - అభ్యుదయం' అని కాగితాలు చినిగేలా ఎర్రయింకుతో వ్రాసిన మాధవరావు, కూతురు జర్నలిజం చదువుతానంటేనే అదిరిపడ్డాడు. పత్రికలో, 'స్టేఫ్ రిపోర్టర్‌గా' చేరటానికి ముందుకొచ్చిననాడు గింజుకొన్నాడు.

"అది స్త్రీలు చేయాల్సిన వృత్తి కాదమ్మా. ప్రముఖులను యింటర్వ్యూ చేయాల్సి వుంటుంది. యీ ప్రముఖులన్న వారిలో చాలా మంది విషయం నీకు తెలియదు. మనిషి చర్మం కప్పుకొన్న పులులు. అందమైన ఆడది కన్పిస్తే పులి, మనిషి రక్తాన్ని పీల్చినట్లు...."

అనిత తండ్రిని చూచి నవ్వింది.

"సంస్కరణ, అభ్యుదయం వొకరికి చెప్పే భావనలే అయినంతకాలం, యీ దేశ నైతికస్థాయి పెరగదు నాన్నా. ఆ భావనలకు విలువ వుండదు_"

అనిత పనిచేసే పత్రిక ఎడిటర్ రాజకీయాల్లో బాగా పేరున్నవాడు. అపోజిషన్ పార్టీయే అయినా, అధికారవర్గాల్లో పలుకుబడివున్నవాడు. రిపోర్టర్లు వ్రాసిన 'డిస్పేచెస్'లో వొకేవొక్క పదాన్ని మార్చటం ద్వారా మొత్తం అర్థాన్నే మార్చగల బిస్మార్క్. పేదల పట్ల జాతి, అధికార వర్గాల్లో అవినీతిని గురించి 'బ్లోఅప్స్' పత్రిక ప్రచారానికి ప్రాణం అని అతని విశ్వాసం.

"మిస్ అనితా. మాధవరావుగారి కూతురువని కళ్ళు మూసుకొని నీకు ఉద్యోగం యిచ్చాం. నీ భావాలను మన పత్రిక సిద్ధాంతాలకు అనుగుణంగా మార్చుకోటం అవసరం. జాతీయ సంస్కృతి, దేశభక్తి యిలాంటి పదాలు బూర్జువా రిపోర్టర్ల సొత్తు. అభ్యుదయ పంథాలో నడిచే మన పత్రికలో వాటికి స్థానంలేదు. సోషలిస్టు రియలిజం స్టడీ చెయ్యి. మాధవరావుగారి కూతురివి. మన పదాలు నీకు నేను నేర్పాలా? మీ నాన్నగారి రచనలు మరోసారి చదువు."

ఉద్యోగంలో చేరిన కొత్తల్లోనే అనితకు చురక తగిలించాడు ఎడిటర్. ఆయన భావాన్ని అర్థంచేసుకోలేనంత రాజకీయ పరిజ్ఞానంలేనిది కాదు అనిత.

"వార్తను వార్తగా ఎవరైనా అందించగలరు. దాన్ని మన సిద్ధాంతానికి అనుగుణంగా, అందంగా, ఆకర్షణీయంగా మలచటంలోనే రిపోర్టర్ అనే ఆర్టిస్ట్ శిల్పం బయటపడుతుంది జర్నలిస్ట్ ప్రొఫెషన్‌కు జీవనాడి అదే. గొప్ప జర్నలిస్టు ఆర్టిస్ కూతురివి. నీకు తెలీకపోతే మీ ఫాదర్ దగ్గర ఆ మెలుకువలు నేర్చుకో."

వాస్తవానికి ఎర్ర రంగో, నల్లరంగో పులమటం_ అది ఆర్ట్ అనటం_ జర్నలిజానికే ద్రోహం కాదూ?

తను ఆ పత్రికలో ఎంతో కాలం పనిచేయలేనని ఆ రోజే నిర్ణయించుకొంది అనిత.

అనిత రిపోర్టులను ఎడిటర్‌గారు స్వయంగా చూచేవాడు. మార్పులు చేసి ఆమె పేరిట ప్రచురించేవాడు. ఏం చేయగలదు అనిత.

రాష్ట్రస్థాయిలో సాహిత్య సభ జరిగిందోసారి వాళ్ళ వూళ్లో. కేశవరావు ఆ సభల్లో పాల్గొనటానికి వచ్చాడు అతను అనిత అభిమాన రచయిత. అతని రచనల్లో రాజకీయవాసనలుండవు. తెలుగుతనం, భారతీయత్వం గుబాళిస్తుంటాయి.

"రచయితకు రాజకీయ అవగాహన అవసరం. అయితే గుడ్డిగా వో పార్టీకో సిద్ధాంతానికో అమ్ముడుపోకూడదు. అలా జరిగితే రచయిత స్వేచ్ఛ అంతరిస్తుంది. అవినీతి, అన్యాయం, అక్రమం ఏ పార్టీలో వున్నా దాన్ని ఎదుర్కొగల ధైర్యం రచయితకుండాలి. మంచి ఎక్కడున్నా అప్రీషియేట్ చెయ్యగల సహృదయతా అవసరమే. అలా కాకపోతే మీలాంటి జర్నలిస్టుకు, నాలాంటి రచయితకు భేదం వుండదు."

అనిత, కోరి యింటర్వ్యూ చేస్తే కేశవరావు సూటిగా అన్నాడు. అతని నిర్మొగమాటం ఆమెకు నచ్చింది.

"మీకు జర్నలిస్టులంటే మంచి అభిప్రాయం లేనట్లుందే?"

"వుంది. కానీ మీలాంటి జర్నలిస్టులంటే లేదు."

అనిత తనపై అంత డైరెక్ట్ ఎటేక్ ఆశించలేదు. అంచేత నివ్వెరపోయిందో క్షణం!

"సర్ ఆర్థర్ కాటన్ పేరు వినే వుంటారు మీరు. ఆయనకు 'సర్' బిరుదాన్ని ప్రసాదించే సభకు రాజకీయ ప్రముఖులెవరూ రాలేదు. పత్రికలో ఆ సభకు ప్రచారం యివ్వలేదు. ఆ తర్వాత కొద్ది రోజులకు వో మిలిటరీ జనరల్‌కు అదే 'సర్' బిరుదాన్ని ప్రసాదిస్తుంటే రాజకీయ వేత్తలతో సభ నిండిపోయింది. బోలెడంత ప్రచారం లభించింది. ఎంచేత నంటారు?" కేశవరావు అనితను సూటిగా చూస్తూ అడిగేడు. అనితకు అది వార్త. అంచేత మాట్లాడలేదు.

"కాటన్ మహాశయుడు భారతదేశంలో కొన్ని ప్రాంతాలు 'అన్నదాత'గా మారేలా చేశాడు.ఎందరో పేద రైతులకు తిండిపెట్టేడు. నీళ్ళు యిచ్చాడు. తద్వారా బ్రిటిష్ సామ్రాజ్యపు ఆర్థికాభివృద్ధికీ తోడ్పడ్డాడు. మిలటరీ జనరల్ అలా కాదు. బ్రిటిష్ సామ్రాజ్యం విస్తరించటానికి డైరెక్టుగా యుద్ధాలు చేసి గెలిచాడు. బ్రిటిష్ రాజకీయ అధికారాన్ని పెంచేడు. సామ్రాజ్య వాదులకు మొదటి దానికన్నా రెండోది ప్రధానం. మరి మీరు 'ప్రజలు

ప్రజలు' అంటూ ప్రతిదీ ప్రజల పేరిటే చేస్తున్నారు కదా? మీరు రాజకీయాలకు అమ్ముడుపోతే ఎలా? సామ్రాజ్యవాద శక్తి కనుక బ్రిటన్ సైనికశక్తికి ప్రాధాన్యత నివ్వటంలో అర్థం వుందేమో! కానీ ప్రజా సమస్యల్ని కూడా విదేశీ రాజకీయ దృష్టితో చూడటంలో అంతరార్థం ఏమిటి?"

కేశవరావు వృత్తిరీత్యా యింజనీర్. అతని వాదన కూడా కాంక్రీటు పునాది మీద నిర్మించినట్లు కన్పించింది అనితకు. అతని అభిప్రాయాలతో ఏకీభవిస్తూ తన సంకట స్థితిని చెప్పుకొంది.

"ఆర్థిక స్థితి విజాతి సిద్ధాంతాలకు అమ్ముడుపోయేటట్లు మారుస్తోంది మనుష్యుల్ని. వొకనాటి మత ప్రచారకులకు యీనాటి అంతర్జాతీయ సిద్ధాంత ప్రచారకులకు గల తేడా నాకేం కన్పించటంలేదు."

కాస్సేపు అలా చర్చ సాగేక కేశవరావు అన్నాడు.

"మీరు వివాహం చేసుకోరా?"

"ఎందుకు చేసుకోను? నా అభిప్రాయాలతో ఏకీభవించేవాడు నన్ను చేసుకోడానికి ముందుకు రావాలిగా?"

"మన అభిప్రాయాలలో సామీప్యత వుంది కదా?"

అనిత తల వూపింది. అతని భావం అర్థమై సిగ్గుపడింది!

"త్వరలో మీ నాన్నగారితో లాంఛనంగా మాట్లాడతాను."

ఇంటర్వ్యూ అలా ముగిసింది.

కేశవరావు అభిప్రాయాలను యధాతధంగా వ్రాసి ప్రచురించింది అనిత. అప్పుడు సంపాదకుడు లేకపోవటంతో ఆమె ఇంటర్వ్యూ రిపోర్టు మార్పులు చేర్పులకు గురికాలేదు.

ఆ ఇంటర్వ్యూ వ్యాసం ప్రచురించబడ్డ పదిరోజుల్లో ఆమెకు ఢిల్లీకి ట్రాన్స్‌ఫర్ అయింది.

* * *

ఢిల్లీ ఆఫీసులో వుద్ధండులున్నారు. వారు అనిత 'బ్రెయిన్ వాష్' చేయటానికి ప్రయత్నించారు. ఎన్నెన్నో ఆశలు పెట్టేరు. వ్యామోహాలు సృష్టించారు. జీతం పెంచారు. తూర్పు ఐరోపా రాజ్యాలకు పర్యటనకు పంపేరు. అనిత దేన్నీ కాదనలేదు. అయితే తన ధోరణిని మార్చుకోలేదు.

యిదలా వుండగా కేశవరావు నవలకు బహుమతి వచ్చింది. బహుమతి ప్రదానోత్సవం హైదరాబాద్‌లో జరుగుతోంది. ఆ విషయం వ్రాస్తూ ఆమెను హైదరాబాద్‌కు రమ్మని వ్రాసేడు. అదే సందర్భంలో మరో ముఖ్య సంఘటన జరగబోతుందని తెలిపేడు.

ఆ సంఘటన ఏమిటో అనితకు తెల్సు. తమ వివాహం నిశ్చయమవుతుంది. అనిత శలవు పెట్టింది. విమానంలో వెళ్తే తప్ప సమయానికి చేరలేదు.

విదేశీ పర్యటనలప్పుడు విమాన ప్రయాణం చేసింది అనిత. కానీ అప్పుడు స్వదేశ భూములపై ప్రయాణం రాత్రివేళ జరిగింది. యిప్పుడు? పగలు ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు ప్రయాణం చేస్తోంది. పైనుంచి మాతృభూమిని చూస్తోంది. ఏదో మధురానుభూతి!

పై నుంచి చూస్తే యీ దేశం చిన్నదిగా కన్పిస్తుంది. కానీ దేశ స్వరూప స్వభావం తెల్సిన వాళ్ళకి పై నుంచి చూస్తే ఎంత వైశాల్యత గోచరిస్తుంది? కొండలు.... నదులు.... మైదానాలు..... పీఠభూములు.... భిన్నత్వంలో ఏకత్వం?

హైదరాబాద్ వస్తోందని ఎనౌన్స్ చేసిందాకా భావన లోకంలోనే వుంది అనిత! తను ఎరిగిన హైదరాబాద్. చాలా ఎత్తునించి చూస్తే అందమైన బొమ్మరిల్లులా వుంది. విమానం భూమికి దగ్గరయ్యే కొద్దీ బొమ్మరిల్లు పెద్దదవుతోంది.

అరె! అదేమిటి? మళ్ళీ బొమ్మరిల్లు చిన్నదవుతోందే?

అప్పటికి గ్రహించింది అనిత. విమానం లేండ్ కావటంలేదు. ఆకాశంలో హైదరాబాద్ నగరం చుట్టూ ప్రదక్షిణం చేస్తోంది.

భయపడనక్కర్లేదని ప్రయాణీకుల నుద్దేశించి ఎనౌన్స్‌మెంట్!

అయిదు.... పది.... పదిహేను నిముషాలు....! విమానం ప్రదక్షిణాలు చేస్తూనే వుంది. ప్రయాణీకుల మొహాల్లో మెల్లమెల్లగా భయం వ్యాపిస్తోంది. అందరి దృష్టి యిప్పుడు కాక్‌పిట్ పైనే! అందులో 'క్రూ' పైనే!

'ఇంజన్ చెడిపోయింది' ఎవరో గొణిగేరు.

'యిలా ఎంతసేపు ఆకాశంలో తిరుగుతుంది? యీ లోగా ప్యూయెల్ అయిపోతే? సందేహం..అనుమానం.. భయం!

ప్రయాణీకులకు ప్రాణాలు అరచేతిలోకి వచ్చాయి.

ఎయిర్ హోస్టెస్ అఫీషియల్‌గా ప్రకటన చేసింది.

'ఇంజన్ ట్రబుల్ ఏమీలేదు. ప్యూయల్ కూడా సమృద్ధిగా వుంది. లేండ్ కావటానికి అవసరమైన వీల్స్ బయటికి రావటంలేదు. ఏదో చిన్న డిఫెక్ట్ వుంది. రెక్టిఫై చేయటానికి ప్రయత్నిస్తున్నారు.'

వీల్స్ విమానపు అడుగు భాగాన అమర్చబడి వుంటాయి. అవసరమైనప్పుడు బయటికొచ్చి మళ్ళీ లోపలికి వెళ్ళిపోయే మెకానికల్ ఏర్పాటు చేయబడి వుంటుంది. ఆ మెకానిజం దెబ్బతింటే ఏం ప్రయత్నించి ఏం లాభం? వీల్స్ పనిచేయకపోతే లేండ్ అయ్యేదెలా? హరిబాప్‌రే!

కొందరు ప్రయాణీకులు లేవ బోయారు. మరి కొందరు వూరికే కంగారుపడిపోయి ఏవేవో వూహించుకొని మాట్లాడేస్తున్నారు. వాళ్ళు చెప్తున్న కథలు ప్రయాణీకుల్ని మరింత భయపెట్టేలా ఉన్నాయి.

'అనవసరంగా కంగారు పడకండి. యిలాంటి సమయంలో చిత్త స్థైర్యం అవసరం. ప్రే గాడ్ ఫర్ మెంటల్ సేటిస్‌ఫేక్షన్.'


ఏమనుకొన్నారో ఏమో చాలామంది కళ్ళు మూసుకొని మౌనంగా కూర్చున్నారు. రామ్....రహీమ్.... క్రైస్ట్.... మనశ్శాంతికి మార్గాలయ్యారేమో!

అనిత నిశ్చలంగా కూర్చొని క్రూ మెంబర్స్ యొక్క ప్రయత్నాలని అబ్జర్వ్ చేస్తోంది. ఆమె యిప్పుడు జర్నలిస్టుగా మారిపోయింది.

క్రూ మెంబర్లలో వొకతను- కో పైలెట్‌లాగా వుంది- లేడర్ సహాయంతో విమానం క్రింది భాగాన వేలాడసాగాడు. వేలాడుతూ ఏదో రిపేర్‌చేస్తున్నాడు.

ఆకాశంలో అంత ఎత్తున వేలాడుతున్నాడు. ఎంత ధైర్యం? ఏమి సాహసం? వొక చేత్తో వేలాడుతూ, మరో చేత్తో రిపేర్‌చేయటం మాటలా? ఆమెకి ఆ చర్య అద్భుతమనిపించింది. ప్రాణాన్ని వొడ్డి అంత సాహసంచేసే శక్తి అతనికెలా వచ్చింది?

అనిత చూస్తుండగానే అతను ఆకాశంలో ఎన్నెన్నో ఫీట్సుచేసి లోపలికొచ్చాడు. విమానం లేండ్ కావటం ఆరంభమయింది. ఎనౌన్స్‌మెంట్ విని ప్రయాణీకులు కళ్ళు తెర్చేరు. వాళ్ళు షాక్‌నుంచి తెరుకొనేసరికి విమానం లేండ్ అయింది. జరిగిందంతా మర్చిపోయి బిలబిలమంటూ ప్రయాణీకులు విమానంలో నుంచి బయటపడ్డారు. వొక్కరూ క్రూ మెంబర్స్‌కు థేంక్స్ చెప్పలేదు.




"మిస్టర్ పైలెట్. అంత సాహసం చేయటానికి మీకు ప్రేరణ యిచ్చిన శక్తి ఏది?"

అతను అనితవైపు ఆశ్చర్యంగా చూచాడు.

"అది నా వుద్యోగ ధర్మంలో భాగం అనుకొంటాను. కాగా అందరు ప్రయాణీకుల్ని రక్షించే ప్రయత్నంలో వొక్క నా ప్రాణంపోయినా నష్టం లేదుగా? దేశం కోసం ప్రాణాలొడ్డిన కర్మవీరులు అనేకులుదయించిన దేశంలో యిదో గొప్ప సాహసమా?" యింగ్లీషులోనే అన్నాడతను.

"సో మీకు ప్రేరణాశక్తి మాతృదేశ ప్రేమ- మానవీయతా భావన. ఏం ఐ కరెక్ట్?"

"సర్టెన్లీ. కానీ యివి అందరిలో వుండాల్సిన గుణాలు. నాలో వుండటంలో గొప్పేమిటి? లేకపోతే నేను దేశ ద్రోహినవుతాను కానీ...."

"థేంక్యూ...."

* * *

సాహిత్య సభకు అప్పటికే 'లైం' అయిపోయినా కేశవరావు ఏమనుకుంటాడోనన్న భావనే రాలేదు అనితకు. ఆమె కళ్ళముందు విమానంలో చూచిన దృశ్యమే కదులుతోంది. నేరుగా పత్రిక ఆఫీసుకు వెళ్ళింది. ఎడిటర్‌గారు సమయానికి వున్నాడు.

"వెరీ యింపార్టెంట్ న్యూస్. ఫ్రంట్ పేజీ కవరేజ్ ప్రామినెంట్‌గా యివ్వాలి" అంటూ తను చూచింది ఎడిటర్‌గారికి వర్ణించి చెప్పింది. అంతా విన్నాక ఆమె ఆశించిన ఏక్షన్ ఎడిటర్ నుంచి రాలేదు. కాగా 'ప్లేన్‌కు డెమేజ్ ఏమన్నా అయిందా? పేసెంజర్స్ ఎవరైనా చనిపోయారా?' అని అడిగేడు. 'లేదు కదా? ఆల్ రైట్ రిపోర్టు వ్రాసివ్వండి.'

సరిగ్గా అదే సమయంలో టెలీప్రింటర్‌లో 'ఫ్లేష్ న్యూస్' వచ్చింది. ఎక్కడో రైలు ప్రమాదం జరిగింది. యాభై మంది చనిపోయారని అధికారుల అంచనా. రైల్వే మంత్రిగారిసానుభూతి, చనిపోయిన వారి కుటుంబాలకు నష్ట పరిహారం ప్రకటన. రైల్వే సిబ్బంది ప్రమాద స్థలానికి హుటాహుటి ప్రయాణం!

ఆ వార్త చూస్తూనే ఎడిటర్‌గారు హడావుడి పడిపోసాగాడు. అప్పటికే సెట్ అయివున్న ఫ్రంట్ పేజీ హెడ్‌లైన్‌ను మార్చేయమని ఆదేశించాడు. ఫోటోలకోసం, ప్రముఖుల కామెంట్స్ కోసం ఫోనుల మీద ఫోనులు....

అనిత రిపోర్టు వ్రాస్తూ యీ గందరగోళాన్ని పట్టించుకోలేదు. రిపోర్టు

వ్రాయటం ముగించి 'యిదిగో సార్ రిపోర్టు. ఫ్రంట్ పేజ్....'

"ఆల్‌రైట్. యిలాగివ్వండి. రేపు కలుద్దాం. నౌ, అయాం బిజీ మిస్ అనితా."

అనిత వస్తూ టెలిప్రింటర్‌లో రిపోర్టు చూచింది. ఆ తర్వాత ఎడిటర్ గారి వైపోసారి చూచింది. అతను చాలా బిజీగా వున్నాడు. మనసులో నవ్వుకొని బయటికి వచ్చేసింది.

* * *

"మిస్టర్ చైతన్యా యిది నా కథ. ముగింపు కాని కథ. యిందులో ఎడిటర్ మీరేననుకోండి. మర్నాడు పత్రికలో ఏ న్యూస్‌కు ప్రాధాన్యత నిచ్చి ప్రచురిస్తారు?" అమృత కథ చదవటం ఆపి అడిగింది. చైతన్య సిగరెట్ వెలిగించి అన్నాడు.

"ప్రజా సమస్యలపట్ల అవగాహన వున్న ఏ సంపాదకుడైనా రైలు ప్రమాదం 'న్యూస్'కు ప్రామినెన్స్ యిచ్చి తీర్తాడు. రెండో దానిలో వార్త ఏముంది? పైలెట్ స్వయంగా చెప్పేడుగా తన డ్యూటీ తాను చేసేనని?"

"పోనీ విమానానికి ప్రమాదం జరిగి ప్రయాణికులంతా చనిపోయారనుకోండి. అప్పుడు విమాన ప్రమాదానికి ప్రాముఖ్యత నిస్తారా? రైలు ప్రమాదానికి ప్రాధాన్యత నిస్తారా?"

"విమాన ప్రమాదానికే. ఎందుకంటే".

"అందులో ధనవంతులు, గొప్పవారు ప్రయాణం చేస్తుంటారు. ఖరీదైన ప్రమాదం అది. అవునా?"

చైతన్య ఖంగుతిన్నాడు. "అది కాదు...." అని ఏమో చెప్పబోయాడు.

"ఏ ప్రమాదం అయితేనేం లెండి. ప్రమాదాలు, చావులు, మీ ప్రజాపత్రికల వారికి ప్రముఖ వార్తలు. సాహసాలు, త్యాగాలు, మాతృభూమిపై ప్రేమ, మానవతా దృక్పథాలు యివన్నీ బూర్జువా సెంటిమెంట్లు, అవునా?"

"మిస్-అమృతా. మీరు రచయిత్రి అని నిరూపిస్తున్నారు. ఫేక్ట్సను ట్విస్ట్ చేస్తున్నారు-"

"అది మీ వృత్తి. యింతకి యీ కథ వాస్తవంగా జరిగింది. జరిగిన కథను నేను భారతీయ వాతావరణానికి అనుగుణంగా మార్చి వ్రాసేను. కానీ వాస్తవ కథలో ముగింపు ఏమిటో తెల్సా? విమాన సంఘటన స్టోరీ ప్రముఖంగా ప్రచురించబడింది. రైలు ప్రమాదం వార్త క్లుప్తంగా ప్రచురింపబడింది. కానీ అందుపై ప్రభుత్వం తీసుకొన్న చర్యలు, చేసిన సహాయం యిత్యాది వివరంగా ప్రచురించారు-"

"నాన్సెన్స్. బూర్జువా ధోరణి అది. ఏ కేపిటలిస్ట్ దేశమమ్మా అది?"

"చెప్తాను కానీ అలా ఎందుకు చేశారని అడిగితే ఆ పత్రికలవారేం సమాధానం యిచ్చారో తెల్సా?" మొదటి సంఘటనవల్ల ప్రజల్లో మాతృభక్తి, త్యాగనిరతి పెరుగుతుంది. అలా జనానికి ఆ పైలెట్ మార్గదర్శకుడవుతాడు. రెండో సంఘటనలో, జరగవల్సిన కార్యానికి ప్రాధాన్యత నివ్వాలి కాని, జరిగిపోయిన వినాశనాన్ని గోరంతలు కొండంతలుగాచేసి వ్రాస్తే ఏం లాభం? అని."

"ఫెంటేస్టిక్ నాన్సెన్స్. వాస్తవ సంఘటనను 'కిల్' చేసిన ఆ పత్రికాధిపతుల్ని వురితీయాలి."

"అవునా? ఆ దేశంలో పత్రికలు ప్రభుత్వాధిపత్యంలో నడుస్తాయి. ప్రైవేటు ఆస్తులు, పత్రికలు, యిత్యాది ధోరణులు లేని వో గొప్ప సోషలిస్టు దేశం. ఆ దేశం పేరు మీరు ఎప్పుడూ జపిస్తుంటారు. అయినా నన్ను ఆ దేశం పేరు చెప్పమంటారా?"

"వద్దు.... వద్దు.... వద్దు...." అని బిగ్గరగా అరిచేడు చైతన్య!

అతడి అవస్థను చూచి అమృత హేళనగా నవ్వలేదు. జాలిపడింది. 'పాపం-పరాన్న జీవి!' అని మనసులో సానుభూతిగా అనుకుంది.

చైతన్య వున్నట్లుండి ఆమె చేతిలో కాగితాల్ని లాక్కొని చించిపారేశాడు!

చైతన్య కాగితాలు చించిపారేసినంత మాత్రాన అమృత భావనలు చెరిగిపోలేదు. ఆలోచనలు ఆగిపోలేదు. మనసులోవున్న కథను మళ్ళీ అక్షర రూపంలో రాయటం పెద్ద కష్టం కాదు. కానీ ముగింపు?

అదేదో దేశంలో జరిగిన ముగింపునే వాస్తవంగా వ్రాద్దామంటే- యిది యిండియా-దట్ యీజ్ భారత్. పైగా కథలో ఎడిటర్, సామాజిక స్పృహ, అభ్యుదయ దృక్పథం గలవాడినని చెప్పుకొనేవాడు. ముగింపును మార్చి పారేస్తాడో? చైతన్యలా కథనే చించి పారేస్తాడో?

ఇక భారతదేశంలో రోజూ జరిగే తంతుతో ముగిస్తే వాస్తవమని కొందరు చంకలు గుద్దుకోవచ్చు. కాని అమృత మనస్సు అందుకు అంగీకరించటంలేదు. ముగింపు మారాలని ఆమె మనసారా కోరుకొంటోంది.

అందుకే ఆ కాలం వచ్చిందాకా కథ ముగింపును వాయిదా వేసింది!